మేఘన కూచిపూడి రంగప్రవేశం

రవీంద్రభారతి, ఫిబ్రవరి10 : ప్రముఖ కూచిపూడి నాట్యగురువు డాక్టర్ పి.రమాదేవి శిష్యురాలు గోరుకంటి మేఘన కూచిపూడి రంగ ప్రవేశం సోమవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. మేఘన విఘ్నేశ్వర దరువు, శివకీర్తన, మహిషాసుర మర్ధని, తరంగం, భామాకలాపంలో రక్తి కట్టించారు. మేఘన కూచిపూడి రంగప్రవేశానికి ముఖ్య అతిథులుగా పద్మశ్రీ అవార్డు గ్రహీత ఉమామహేశ్వరి, కేంద్ర సంగీతనాటక అకాడమీ అవార్డు గ్రహీత కళా కృష్ణ, భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి,సీఐ చంద్రమౌళి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి మేఘన గోరుకంటి కూచిపూడి రంగప్రవేశాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. మన పూర్వీకులు ప్రసాదించిన ప్రాచీన లలిత కళలలో నాట్యశాస్త్రం ఒకటని, ఈ ప్రాచీన నాట్యశాస్త్రాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత నాట్యగురువులపై ఉందన్నారు. సభకు ముందు మేఘన గోరుకంటి ప్రదర్శించిన కూచిపూడి నృత్యప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకున్నది.ఈ కార్యక్రమంలో మేఘన తల్లిదండ్రులు గోరుకంటి వెంకటేశం, గోరుకంటి మీన తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వివాహ పరిచయ వేదిక

కాచిగూడ, ఫిబ్రవరి 10: విశ్వబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదికలను సద్వినియోగం చేసుకోవాలని విశ్వకర్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అడ్లూరి రవీంద్రాచారి విజ్ఞప్తి చేశారు. సోమవారం కాచిగూడ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. విశ్వకర్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ తెలుగు రాష్ట్రాల విశ్వబ్రాహ్మణ యువతీయువకుల కోసం ఈ నెల 11వ తేదీన ఇబ్రహీంపట్నంలోని మంగళపల్లి మహమ్మాయిదేవి దేవాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 వరకు వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 984819 9744లో సంప్రదించాలని కోరారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం

కాచిగూడ, ఫిబ్రవరి 10: ఆత్మరక్షణ కోసం విద్యార్థులు కరాటేను నేర్చుకోవాలని, చదువుతో పాటు కరాటేనే అభ్యసించడం ఎంతో అవసరమని కరాటే మాస్టర్ వి.శ్రీకాంత్‌చారి అన్నారు. న్యూ డ్రాగన్ ఫైటర్స్ మార్షల్ ఆర్ట్స్‌అసియేషన్ ఆధ్వర్యంలో సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించిన 4వ ఇంటర్ నేషనల్ కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్ షిఫ్ కరాటే పోటీలు నిర్వహించగా రెండవ తరగతి చదువుతున్న విల్థాపురం నిహాల్ గౌడ్ వెండి పతకాన్ని సాధించారు. అనంతరం కరాటే మాస్టర్ మాట్లాడుతూ.. ఆత్మరక్షణకు కరాటే ఆయుధంలా పనిచేస్తుందని తెలిపారు.

ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం

ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌తో నాగేందర్‌బాబ్జి, భీష్మా, శేషు, మహేశ్, రాజేశ్ తదితరులు

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కాచిగూడ, ఫిబ్రవరి 10 : అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏడాది గడుస్తున్నా ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడంతో ప్రజలు ఛీ కొడుతున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆరోపించారు. కాచిగూడలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఉప ఎన్నికలు ఎప్పుడొచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని నిలుపునిచ్చారు. బూటకపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని గెలిపించడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని, మాజీ సీఎం కేసీఆర్ పథకాలను సద్వినియోగపరుచుకున్న లబ్ధిదారులందరూ బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ధాత్రిక్ నాగేందర్‌బాబ్జి, ఎర్ర భీష్మాదేవ్, శేషుపేరి, మహేశ్‌కుమార్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

మీర్ చౌక్‌లో ఇద్దరు దొంగలు అరెస్ట్

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 10 : ఓ ఇంట్లో పడి దోచుకున్న ఇద్దరు దొంగలను పట్టుకొని అరెస్టు చేసిన సంఘటన మీర్ చౌక్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం వెలుగు చూసింది. ఈ మేరకు మీర్ చౌక్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వి. వెంకటేశ్వరరావు వివరాలను వెల్లడించారు. ఎంజీబీఎస్ సమీపంలోని కాళీ కబర్ బస్తీలో నివసించే మహమ్మద్ ఇమ్రాన్(29)కు కిరాణా స్టోర్ ఉంది. ఇతని వద్ద దూరపు బంధువు మహమ్మద్ నూర్ హస్సన్(33) కొన్ని రోజులు పని చేసి మానేశాడు. ఈ నెల నాలుగో తేదీ తెల్లవారుజామున ఇమ్రాన్ ఇంట్లో నుంచి ఐరన్ లాకర్ ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఉదయం నిద్రలో నుంచి లేచి చూసిన ఇమ్రాన్ లాకర్ లేకపోవడంతో చోరీ జరిగినట్లు గ్రహించి మీర్ చౌక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన డీఐ దిలీప్ కుమార్ తన సిబ్బందితో కలిసి సోమవారం ఉదయం నూర్ఖాన్ బజార్ సమీపంలో మహమ్మద్ నూర్ హసన్, హిమాయత్ హుస్సేన్ అన్సారి(23)లను పట్టుకున్నారు సీసీ కెమెరాలు ఫుటేజీల ఆధారంగా దొంగలను పట్టుకున్నట్టు ఏసీపీ వెంకటేశ్వరరావు తెలిపారు. దొంగల వద్ద నుంచి మూడు తులాల బంగారు ఆభరణాలు. చోరీ చేసిన సొత్తును స్వాధీనం చేసుకొని దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ వి. వెంకటేశ్వరరావు

మురళీమోహన్‌కు ఎన్టీఆర్ పురస్కారం

మురళీమోహన్‌కు ఎన్టీఆర్ పురస్కారాన్ని బహూకరిస్తున్న నందమూరి రామకృష్ణ

రవీంద్రభారతి,ఫిబ్రవరి10 : ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాలను పురస్కరించుకొని మైహోమ్ అవతార్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్(కల్చరల్ వింగ్) ఆధ్వర్యంలో డా.నందమూరి తారక రామారావు సినీ వజ్రోత్సవం సందర్భంగా సినీనటుడు మురళీమోహన్‌కు ఎన్టీఆర్ పురస్కార ప్రదానోత్సవం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నందమూరి రామకృష్ణ విచ్చేసి మురళీమోహన్‌కు ఎన్టీఆర్ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. క్రమశిక్షణ,అంకితభావం, సేవా దృక్పథం కలిగిన ఎన్టీఆర్ గొప్ప మహనీయుడని కొనియాడారు.ఎన్టీఆర్ పురస్కారానికి సినీనటుడు మురళీమోహన్ అన్ని విధాల అర్హుడని అన్నారు. మురళీమోహన్ మాట్లాడుతూ.. ఎన్టీఆర్ తన అభిమాన ఆరాధ్య దైవమని ఈ అవార్డు ఆయన కుమారుడు రామకృష్ణ చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. సభకు ముందు సినీ జర్నలిస్టు ఏస్‌వీ రామరావు రూపొందించిన విశ్వవిజేత ఎన్టీఆర్ జీవిత లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. జె.రాధాకృష్ణ,ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి మరింత కృషి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 10: బీఆర్ఎస్ బలోపేతానికి ప్రతి ఒక్కనాయకుడు, కార్యకర్త కృషి చేయాలని చేయాలని రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్ అన్నారు. రాంనగర్ లో డివిజన్ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారంచేయాలి అన్నారు. ఈ సందర్భంగా పార్టి ని అందించన క్యాలెండర్, డైరీలను నాయకులు, కార్యకర్తలకు అందజేశారు. నాయకులు నాగభూషణం, ముదిగొండ మురళి, జ్ఞానవేశ్వరి, గోక నవీన్, శ్రీకాంత్ ముదిరాజ్, సందీప్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు చెల్లించాలని 19న కమిషనర్ కార్యాలయం ముట్టడి

కమిషనర్ అజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎం. నరసింహ తదితరులు

సుల్తాన్ బజార్, ఫిబ్రవరి 10 : తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు రావలసిన ఏడు నెలల జీతాలు వెంటనే చెల్లించని పక్షంలో ఈనెల 19వ తేదీన కమిషనర్ కార్యాలయం ముట్టడించి ధర్నా నిర్వహిస్తామని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్, ఎం. నరసింహ తెలియజేశారు. సోమవారం కార్మికులతో కలిసి టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌కు ధర్నా నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 21 తేదీన కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చి కార్మికుల జీతాలు చెల్లించనిచో ప్రతిరోజూ రాష్ట్రంలోని అన్ని తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఒక గంట నిరసన కార్యక్రమాలు చేపడతామని చెప్పి నిరసన నిర్వహిస్తున్న ప్రభుత్వం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పేద కార్మికులు నెలల తరబడి జీతాలు చెల్లించకుండా ఏ విధంగా విధులకు హాజరవుతారని తమ కుటుంబ పోషణ, పిల్లల చదువులు, ఇంటి రాయిలకు కార్మికులు అనేక ఇబ్బందుల్ని పడుతున్న వారి బాధను పట్టించుకునే నాథుడే కరువయ్యారని అన్నారు. కార్మికుల శ్రమ ని ఒకవైపు కాంట్రాక్టర్లు దోచుకుంటూ తక్కువ జీతాలు చెల్లిస్తున్నారని ఆ జీతాలు సైతం నెలల తరబడి చెల్లించకపోవడం తీవ్ర అన్యాయమని అన్నారు.

ప్రభుత్వం వెంటనే బిల్లులు రిలీజ్ చేసి కార్మికులకు జీతాలు చెల్లించనిచో ఈ నెల 19వ తేదీన కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించి భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

ముగిసిన కుస్తీ పోటీలు

జియాగూడ మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించిన కుస్తీ పోటీల విజేతలతో నాయకులు

కార్వాన్, ఫిబ్రవరి 10 : జియాగూడ మున్సిపల్ గ్రౌండ్‌లో వీర్ చంద్రశేఖర్ ఆజాద్, బోలు సింగ్ 4వ కుస్తీ కేసరీ చాంపియన్‌షిప్ పోటీలు ముగిసాయి. చివరి రోజు కుస్తీ పోటీలకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, మత్స్య శాఖా చైర్మన్ మెట్టు సాయికుమార్, కార్వాన్ నియోజక వర్గం బీ బ్లాక్ అధ్యక్షుడు కూరాకుల క్రిష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కుస్తీ పోటీల వల్ల ఆత్మ విశ్వాసం, పోటీతత్వం పెరుగుతుందని అన్నారు. కుస్తీలలో రాణించాలంటే కఠిన వ్యాయామాలు అవసరమన్నారు. ఈ సందర్భంగా కుస్తీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ధరం సింగ్ పహిల్వాన్, గుడిమల్కాపూర్ మార్కెట్ డైరెక్టర్ ముంగి రఘుపాల్ రెడ్డి, వినోద్ సింగ్, అబ్దుల్ హమీద్, రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పాతబస్తీలో బీసీ గర్జన

పాతబస్తీలో నిర్వహించిన బీసీ గర్జనలో అభివాదం చేస్తున్న బీసీ నాయకులు

చాంద్రాయణ గుట్ట, ఫిబ్రవరి 10 : హైదరాబాద్ పాతబస్తీలో బీసీ గర్జన చేపట్టారు. ఆకుల శ్రీనివాస్ పాతనగర బీసీల తరపున విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల శ్రీనివాస్‌తో పాటు సరిత రజక సంఘం, తిరుపతి శివకుమార్ ఓల్డ్ సిటీ మున్నూరు కాపు సంఘం , భిక్షపతి మున్నూరు కాపు సంఘం, హేమంత్ చారి విశ్వ బ్రాహ్మణ సంఘం, గుర్రం ఆంజనేయులు పద్మ శాలి సంఘం , లింగం నాయి బ్రాహ్మణ సంఘం, సత్య నారాయణ పద్మ శాలి సంఘం, మహమ్మద్ నాదీం బీసీ సంఘం, ప్రవీణ్ కుమార్ మున్నూరు కాపు సంఘం వారంతా పాల్గొన్నారు. ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి బీసీ ల పట్ల సవితి తల్లి ధోరణి పాట్టిస్తున్నారని విన్నవించారు. బీసీ ల కుల గణన సరిగా కాలేదని బీఆర్ఎస్ ఇచ్చిన దానికి అనుగుణంగా సర్వే ఇచ్చిన కాంగ్రెస్ అంటే దాదాపు 20 లక్షల మంది పేర్లు గల్లంతు అయ్యాయి. బీసీ కులగణన సరిగా చేయలేదు కాబట్టి మేము నగరం నుంచి బీసీ గర్జన పిలుపు ఇస్తున్నాం. అందరం కలిసి ఇప్పుడు ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి బీసీ లకు న్యాయం చేకూరేలా చేస్తామని అన్నారు లేకుంటే పెద్ద ఎత్తున అన్ని సంఘాలు ఏకమై బీసీ లకు అన్యాయం జరగకుండా చూస్తామని అన్నారు.

యువతులు అదృశ్యం

కాచిగూడ, ఫిబ్రవరి 10: ఇంట్లోంచి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై పి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మౌలానా ఆజాద్‌నగర్ ప్రాంతానికి చెందిన సురేశ్ కుమార్తె సంజన(14) ఈ నెల 8వ తేదీన ఇంట్లోంచి వెళ్లి ఇప్పటికీ తిరిగి రాకపోవడంతో కలతచెందిన కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంట్లోంచి సంజన వెళ్లే సమయంలో లేత పింక్ గల కుర్తపైజామా, నీలి రంగు చున్నీ ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోతిమార్కెట్ ప్రాంతంలో మరోయువతి..

ట్యూషన్‌కు వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఎస్సై పి.రవికుమార్ వివరాల ప్రకారం.. మోతిమార్కెట్ ప్రాంతానికి చెందిన సుశీల్‌దూబే కుమార్తె దూబే ప్రియాంక(15) ఆదివారం ట్యూషన్‌కు వెళ్లి ఇప్పటికీ తిరిగి రాకపోవడంతో సోదరి జుహిద్ దూబే సోమవారం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇంట్లోంచి ప్రియాంక వెళ్లే సమయంలో గోధుమ రంగు కుర్తపైజామా ధరించి, ఎత్తు 5.3 ఉన్నట్లు తెలిపారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అగ్నిప్రమాద ఘటన స్థలాన్ని సందర్శించిన చార్మినార్ ఎమ్మెల్యే

పాతబస్తీలోని చార్మినార్ సమీపంలో ఉన్న దివాన్దేవుడి మదీనా మార్కెట్లో జరిగిన అగ్నిప్రమాదం సంఘటన గురించి సోమవారం తెల్లవారుజామున తెలుసుకున్న చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ, ఎంఐఎం ఎమ్మెల్సీ రియాజ్జుల్ హసన్ అఫండితో కలిసి సందర్శించారు. అగ్నిప్రమాదం జరిగి నష్టపోయిన బాధితులకు ఎంఐఎం పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. పోలీసులు అగ్నిప్రమాదం పై అన్ని కోణాలలో విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. – చార్మినార్, ఫిబ్రవరి 10

బిన్నుకు సుబ్రహ్మణ్యశాస్త్రి పురస్కారం

బిన్నుకు పురస్కారాన్ని బహూకరిస్తున్న హనుమంతరావు, ఇతర వక్తలు

రవీంద్రభారతి, ఫిబ్రవరి10 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బుర్రా సుబ్రహ్మణ్యం శాస్త్రికళాపీఠం ఆధ్వర్యంలో విఖ్యాత రంగస్థల ప్రయోక్త చిత్ర లేఖకుడు బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి88వ జయంతి వేడుకలను పురస్కరించుకొని చిత్రకారుడు, కార్టూనిస్ట్ బిన్ను(నరసింహారావు)కు సుబ్రహ్మణ్య శాస్త్రిచిత్రలేఖన పురస్కారం ప్రదానోత్సవ కార్యక్రమం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వక్తలుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు పాల్గొని చిత్రకారుడు బిన్నుకు పురస్కారం బహూకరించి మాట్లాడుతూ.. సుబ్రహ్మణ్యం శాస్త్రి స్త్రీ పాత్రలు ధరిస్తూ నాటకాల్లో ఖ్యాతి పొందారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పసుమర్తి శేషుబాబు, ముద్దాళి రఘురామ్, రేవతి రామకృష్ణ, భాగిశాస్త్రితదితరులు పాల్గొన్నారు.

కార్లకున్న సైరన్‌ల తొలగింపు

నిబంధనలను విరుద్ధంగా కార్ల అద్దాలకు బ్లాక్ ఫిలింలు, సైరన్‌లను వాడుతున్న కార్లపై చర్యలు తీసుకుంటున్నారు. లంగర్ హౌస్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అంజయ్య ఆధ్వర్యంలో సోమవారం రింగ్‌రోడ్ ప్రాంతంలో కార్ల అద్దాలకు బ్లాక్ ఫిలిం లను తొలగించారు. అదేవిధంగా హారన్‌లను తొలగించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ అంజయ్య మాట్లాడుతూ.. తాము స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి వాహనదారులపై చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు .

– మెహిదీపట్నం, ఫిబ్రవరి 10

చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలి

పారిశుధ్య సమస్యలు లేకుండా జీహెచ్ఎంసీ అధికారులు ఎప్పటికప్పుడు చెత్తను తరలించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. ఆయన ఆదేశాలతో జీహెచ్ఎంసీ సర్కిల్ 13 ఏఎంఓహెచ్ ఇర్షాద్ బస్తీలలో పర్యటించి, సోమవారం లంగర్ హౌస్ డివిజన్‌లోని అంబేద్కర్ నగర్, ప్రశాంత్ నగర్, బాపు నగర్ బస్తీలలో ఎంఐఎం నాయకుడు రమేశ్‌తో కలిసి తొలగింప జేశారు.

– మెహదీపట్నం, ఫిబ్రవరి 10

ప్రహరీ నిర్మించాలి

కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

అంబర్‌పేట, ఫిబ్రవరి 10: బాగ్‌అంబర్‌పేట డివిజన్ శ్రీరమణ థియేటర్ వద్ద గల మైనార్టీ శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని మైనార్టీ నాయకులు కార్పొరేటర్ బి.పద్మా వెంకటరెడ్డికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ప్రతినిధులు యూసుఫ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బి.వెంకటరెడ్డి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మహా కుంభమేళాకు..ఆర్యవైశ్య సంఘం

లంగర్ హౌస్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి మహా కుంభమేళకు 107 మంది బయలుదేరి వెళ్లారు. మహారాష్ట్రలోని నాగపూర్ రామ్ టెక్ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు సీతారాముల స్వామివారికి ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు విప్పు మత్తూర్ రెడ్డిశెట్టి కృష్ణమూర్తి గుప్త కంచర్ల వెంకటేశ్ గుప్తా, భీమిశెట్టి, దశరథం వేముల రాములు, మలిపెద్ది రాములయ్య, సత్యం, శంకర్, కార్తీక్, ముప్పిడి రాజేశ్, ఆకారం నరసింహులు, సదానంద్ ప్రసాద్ తివారి, మల్లి కార్జున్ రెడ్డి కౌకుంట్ల వినయ్ మంచి కంటి నర్సింలు తణుకు కిషన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం ఫిబ్రవరి 10

సమస్యలు లేకుండా చూడాలి

రంజాన్ మాసంలో ప్రజలకు సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. సోమవారం నాంపలి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని కలిసి ప్రజల అభివృద్ధికి చేపడుతున్న పనుల గురించి వివరించారు. దీనికి స్పందించిన ఎంపీ నియోజకవర్గంలోని అన్ని మసీదులలో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు

– మెహిదీపట్నం, ఫిబ్రవరి 10

డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్

మెహిదీపట్నం, ఫిబ్రవరి 10 : ప్రజలకు డ్రైనేజీ సమస్యలు లేకుండా చూడాలని కార్వాన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. సోమవారం సాయంత్రం నానల్ నగర్ డివిజన్‌లోని హకీంపేట్, మిరాజ్‌కాలనీ ప్రాంతాలలో కార్పొరేటర్ నసీరుద్దీన్ తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. డ్రైనేజీ పైప్ లైన్ల పై కప్పుల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని అధికారులకు ఆయన సూచించారు.

యాకుత్ పురలో శ్మశాన వాటికల అభివృద్ధి

షబ్ ఏ భరాత్ ను పురస్కరించుకొని ముస్లింలు శ్మశాన వాటికలలో ప్రార్థనలు జరుపుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని యాకుత్పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. సోమవారం యాకుత్ పుర నియోజకవర్గంలోని దబీర్‌పుర, పత్తర్‌గట్టి మొగల్ పుర, డివిజన్లో ఎమ్మెల్యే అధికారులతో కలిసి పర్యటించారు. ఈ నెల 13వ తారీకు లోపల పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దబీర్ పుర కార్పొరేటర్ అలందర్ వలజాయి తదితరులు పాల్గొన్నారు.

–చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 10

దీపక్ రెడ్డికి సన్మానం

హైదరాబాద్ బీజేపీ పార్టీ సిటీ సెంట్రల్ అధ్యక్షుడిగా ఎన్నికైన లంకాల దీపక్ రెడ్డిని సోమవారం నాంపల్లి నియోజకవర్గం ఆసిఫ్ నగర్ డివిజన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు చెన్నబద్ని ముఖేశ్, నాయకులు రమేశ్, రవి తదితరులు పాల్గొన్నారు . – మెహిదీపట్నం